# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## పుగళేంది

### (విజయచిత్ర – 1977 )

ప్రస్తుతం మూడు తెలుగు చిత్రాలకు సంగీత దర్శకత్వం నిర్వహిస్తున్న స్వరమేధావి శ్రీ పుగళేంది, శ్రీ కె.వి.మహదేవన్ సంగీతంతో వెలువడిన అనేక తెలుగు చిత్రాలకు సహాయ సంగీత దర్శకులై సహకరించిన అనుభవజ్ఞులు. 'యంగ్ టర్క్స' నిర్మిస్తున్న "పసివాని పగ" చిత్రానికీ, దేవీశంకర్ పిక్చర్స్ వారి "వైశాలి"కీ, శ్రీ కాళేశ్వరీ ఎంటర్ ప్రైసెస్ వారి న్యూవేవ్ చిత్రానికీ పుగళేంది స్వరసారధి. ఆ చిత్రాలలోని ఈయన స్వర రచనలు విన్న వారినందరినీ ఆకట్టుకుంటున్నాయి. వీరికి గల చిరకాల సహాయ సంగీత దర్శకత్వానుభవం ఇప్పుడు ఎంతగానో సహకరిస్తూ ఉంది.

పుగళేంది కేరళ ప్రాంతంలోని తిరువనంతపురంలో జన్మించారు నలభై మూడేళ్ళ క్రితం. వీరి తండ్రి టి.ఎన్.కేశవపిళ్ళై, "అయ్యప్ప విలాస్; అనే హోటల్ కి ప్రొప్రైటర్; రంగస్థల నటులూ, సంగీతారాధకులూ కూడా కనక, పుగళేందికి గల సంగీత జ్ఞానం పైతృక సంపత్తి.

సాధారణంగా సంగీతారాధకులు ఇతర విద్యాభ్యాసంలో ఒక్కింత అశ్రద్ధ వహించడం పరిపాటి ఆ పరిపాటికి చెందని వారు కారు మన పుగళేంది. త్రివేండంలోని సాలై విభాగంలో కల వి.ఎం. స్కూల్లో 5వ క్లాసుతోనే చదువుకు స్వస్తి చెప్పారు. దీనికి కారణం వీరిలో అంతర్లీనమై ఉండిన నాటకాసక్తీ, గానానురక్తీ.

కొడుకు ధోరణి పసికట్టిన కేశవ పిళ్ళై, అబ్బాయిని చదువుకోమని నిర్బంధించలేదు. ఆ రోజుల్లో వారి ఊరికి అరుదెంచిన ప్రసిద్ధ గాయనీమణి కె.బి. సుందరాంబాళ్ వద్దకు కుమారుణ్ణి తీసుకొని వెళ్ళి పరిచయం చేయగా, ఆమె బాలుడి ప్రతిభనూ, ఉజ్వల భవిష్యత్తునూ గుర్తించి, ఆప్యాయంగా ఆశీర్వాదాలొసిగారు.

పుగళేంది నాటక జీవనం 11 ఏటనుండే ప్రారంభమైంది. పిన్నవయస్సులోనే పెద్ద సంగీత పాత్రలు ధరించి మెప్పులందుకున్నారు. నాగర్కోయిల్ లో శ్రీ టి.పొన్ను స్వామి పిళ్ళై ఆధ్వర్యంలో వెలసిన "బాలగాన సభ"లో చేరి, అనేక నాటకాల్లో పాల్గొన్నారు పాడే పాత్రలు నిర్వహిస్తూ. ఉత్తరోత్తరా

ఆర్థికాలైన ఇబ్బందులకు గురియై పొన్నుస్వామి కంపెనీ నడపలేని పరిస్థితి రాగా కంపెనీకి చెందిన కొందరు పూనుకుని, “మంగళ బాల గాన సభ” పేరిట నడపసాగారు. వీరు ఆ కాలంలో వేసిన డ్రామాలు “రామాయణం, లవకుశ, కండిరాజా” మొదలైనవి.

ఈ కంపెనీయే తరువాత, అనగా సుమారు ఇరవై యారు సంవత్సరాల క్రితం ఎన్.ఎస్.కె. నాటక సభగా రూపొందింది. కీ||శే||ఎన్.ఎస్. కృష్ణన్ గారి నేతృత్వంలో. ఆ ప్రముఖ హాస్యనటుడు కారాగారానికి వెళ్ళిన రోజుల్లో ఈ సభ కుంటు పడేసరికి పుగళేంది, శ్రీశక్తి కృష్ణస్వామి గారి “శక్తి నాటక సభ”లో చేరి పనిచేశారు.

ఇలా ఉంటుండగా దిండికల్లులో పుగళేంది “స్వర్గసీమ” తెలుగు చిత్రం చూడడం తటస్థించింది. అందులో శ్రీమతి పి. భానుమతి పాడిన “ఓ హోహో పావురమా” వీరినెంతో ఆకర్షించింది. వీరు పాడగా విని, శ్రీ శక్తి కృష్ణస్వామి ఆ పాట బాటలో ఒక తమిళ గీతం రచించి, “కవియిన్ కనవు” అనే తమ తమిళ నాటకంలో ఆ పాట కోసమనే లేని ఒక సన్నివేశాన్ని సృష్టించి, పుగళేందికి బిచ్చమెత్తే ఒక చిన్న అమ్మాయి వేషం ఇచ్చి పాడించారు. ఈ పాట విని సభికులు అచ్చెరువొందింది. హర్షధ్వానాలు చేసేవారు. “ఓహోహో వాడుదమ్మ” అనే ఈ పాటను పదే పదే పాడించేవారు వన్స్ మోర్లతో. బెంగళూరులోని గుబ్బి వీరణ్ణగారి థియేటర్లలో జరిగేవి ఈ నాటక ప్రదర్శనలు. నాటక కంపెనీతో బాటు పుగళేంది అక్కడ మూడు నాలుగు నెలలు ఉండిపోయారు.

అంతలో వీరికి టీన్_ఏజ్ ముదురుతున్న సమయంలో గొంతు కూడా ముదిరి బొంగురు పోయింది. అమ్మాయి గొంతులా సన్నగా వెన్నలా ఉండే కంఠస్వరం ఇనుములా గట్టిపడిపోయింది గానానికి సరిపడని రీతిగా. కనక, పాడే పాత్రలకు పనికి రాక, తోటిపని వాళ్ళ గేలికి గురియై వేదనలో వేగి, వీరు సమయాన్ని వృథా చెయ్యడం ఇష్టంలేక, టైలరింగు, మేకప్, వగైరా చిల్లర కళలూ, సాహిత్య రచనా చేసుకుంటూ కాలం గడిపేవారు. అప్పుడప్పుడు శ్మశాన పరిసరాలకు వెళ్ళి ఏదో తెలియని ఆవేదనతో. వేదాంత భావంతో గీత రచన కావిస్తూ ఉండేవారు.

అంతకు మునుపు కొంతగానే తెలిసిన హార్మోనియం వాయించడాన్ని అభివృద్ధి చేసుకోవాలనే ఆకాంక్ష చిగురెత్తింది. ప్రముఖ రచయిత శ్రీ ఎం.పి.శివం వీరికి గురువూ, బంధువూ కూడా. శివం, ‘బాలగాన సభ’ నాటినుంచీ నాటక సభలకు సంగీత దర్శకులుగా పనిచేస్తూ, పుగళేందికి ప్రథమ సంగీత సాంప్రదాయాలు బోధించేవారు; హార్మోనియం వాయంపించేవారు. పాడడం మాని పుగళేంది హార్మోనియం అభివృద్ధి చేసుకోవడాన్ని చూసి, అసూయా పరులైన కొందరు మిత్రులు, ‘ఆహా! భావి సంగత దర్శకుడు బయలుదేరాడండీ,’ అని వెక్కిరించేవారట. అలా వెక్కిరించిన వారిలో కొందరు ఇటీవల వీరికింద పనిచేయడానికి గత్యంతరం లేక తల వొగ్గడం, విధి సలిపే విచిత్రలీలలలో ఒకటి అనిపిస్తుంది అంటారు పుగళేంది.

అలా హార్మోనియం అభ్యసిస్తూ ఉండగా, ‘తోషన్’ అనే తమిళ డ్రామాకి సంగీత రచన చేస్తున్న ఎం.పి.శివం, వాయుబాధ(గాస్ట్రిక్ ట్రబుల్) కి గురియై ఎక్కువగా శ్రమపడలేని సందర్భంలో కొన్ని గీతాలకు స్వరకల్పన చెయ్యమని తమ శిష్యుడ్ని ఆదేశించారు. ఆయన ఆజ్ఞానుసారం పుగళేంది పాటలకి చక్కని వరుసలు కూర్చారు. కాని, ఒక పాటకు కూర్చిన రాగం గురించి ఒక చర్చావాదం లేవదీశాడొక వయొలిన్ వాద్య కారుడు, పుగళేంది ప్రతిభను భరించలేక ఆయన్ని నగుబాటు పాలు జేయాలనే దురుద్దేశ్యంతో. పుగళేంది కూర్చిన స్వరాలను శివం ఆర్కెస్ట్రాకు చెప్తుతూండగా జరిగిందీ వితండవాదం. “నాటకురించి” అని పలికిన ఈ రాగంలో పంచమం ప్రయోగింపబడక పోవడం వల్ల అది “రవిచంద్రిక” అనే మరో రాగమని ఆ వాయులీన విద్వాంసుడి వాదన. శివం నాలిక కరుచుకున్నారు.

కాని, పుగళేంది సమయస్ఫూర్తితో, తనకు అంతకు ముందు ఆ విషయం తెలియకపోయినా, శివంతో వయొలినిష్టు చేస్తూన్న వాదం వినేటప్పుడే ఆ రాగం లోతుపాతులు గ్రహించి, ‘పాట’లో చేయబడిన పంచమ స్వరప్రయోగం, ప్రమాదవశాన (పొరపాటున) శివంగారు చెప్పడం మరిచిపోయారని సర్ది చెప్పి, గురువుగారి గౌరవంతో పాట తన ప్రతిభ, ప్రతిష్ఠను కూడా నిలుపుకున్నారు అతి చాకచక్యంగా. ఈ సంఘటన సంగీతం పెంపొందించుకోదలచిన తన పట్టుదలను ఇంకా బలపరిచే సరికి మరింత శ్రద్ధత, నిష్ఠతో సంగీత సాధన చేశారు పుగళేంది క్రమంగా.

ఈ పై వాదం విని అత్యంత ప్రభావితులైన శక్తి కృష్ణస్వామి, పాటలకు మట్లు ఎవరు కట్టారని పుగళేందిని అడగ్గా, ఆయనకు నచ్చలేదనుకుని, భయంతో జరిగిన విషయాల వివరాలు తెలిపారు. ‘శక్తి’, పుగళేంది గీతాలను ఎంతో మెచ్చుకుని, తమ తదుపరి నాటకాలకు సంగీతం అందించమని కోరారు. కాని, వినయంతో గురువుగారి స్థానాన్ని వారి అనుమతి లేకుండా ఆక్రమించే అన్యాయం తాను చెయ్యలేనని పుగళేంది పలికిన పలుకులు విని, ‘శక్తి’ మరింత మెచ్చుకున్నారు వీరి నీతిని, నిజాయితీనీ.

వేలూరు లోని దిల్ కుష్ పార్క్ లో నాటక ప్రదర్శనలు సాగుతూన్న సమయాన శక్తి నాటక సభలో పనిచేసే ఒక గుమాస్తా వేలప్పన్ అనే ఆయన ఒక ఇంగ్లీషు డ్రామా ఆధారంగా "నినైవుక్కల్" అనే క్రైస్తవ నాటక రచన ప్రారంభించి, కారణాంతరాల వల్ల సగంలో నిలుపు చేయవలసి వచ్చేసరికి, ఆ వేలప్పన్ వదలి వేసిన మిగిలిన సగమూ ఈ వేలప్పన్ పూర్తి చేశారు సకాలంలో. అన్నట్లు, పుగళేంది అసలు పేరు కూడా వేలప్పనే. విధి విచిత్ర లీలలకు ఇది మరో దృష్టాంతం. పుగళేంది అనే ఈ వేలప్పన్ ను ఇప్పుడు సన్నిహితులందరూ "అప్పు" అని అప్యాయత ఒలకబోస్తూ పిలవడం అలవాటై కూర్చుంది. "అప్పు" అంటే తెలుగులో "ఋణం" అని అర్థం అయినా సంస్కృతంలో ప్రాణాధారమైన "నీరు" అని అర్థం. ఏనాటి "ఋణమో" తీర్చుకోడానికే మన "అప్పు" (పుగళేంది) తెలుగు చిత్రాలకు కూడా "సంగీత సుధా 'జలా'భిషేకం" చేయడానికి అనువైన అవకాశాలు లభించి ఉండవచ్చు.

దిల్ కుష్ పార్కులో నడిచిన ఒక నాటకానికి సంగీతం సమకూర్చవలసిన సంధర్భానే వేలప్పన్, తమిళ భాషాభిమానం జ్ఞానం పెంపొందిన కారణంగా, ప్రసిద్ధ తమిళ సాహిత్యకారుడైన "పుగళేంది" అనే మహానీయుడి పేరునే తమ వృత్తి నామంగా స్వీకరించారు. ఎం.పి.శివం గారి శిష్యుడి వృత్తి పేరూ, ఆయన కొడుకు అసలు పేరూ ఒకటే కావడం మరో గమనార్హమైన విశేషం.

ఇలా 'పుగళేంది' గా మారిన వేలప్పన్ ఒక రోజున ఒక డ్రామా బాపతు పాట రిహార్సలు, ఆర్కెష్ట్రా చేత చేయిస్తుండగా, గురువుగారైన శివం అక్కడికి విజయం చేసేసరికి, అనుకోకుండా శిష్యుడికి కంపం పుట్టుకొచ్చింది. వెంటనే రిహార్సల్సు నిలిపేసి, తరువాత చేద్దామని ఆర్కెష్ట్రా వారిని పంపించేసే సరికి, అపార్థం చేసుకున్న శివం "ఆకాశంలో గరిడీ చేసే గారడీ వాళ్ళు సైతం, ఆఖర్ని డబ్బులడిగేందుకు భూమికి దిగిరావలసిందే," అనే అరవ సామెతను వ్యంగ్యంతో విసిరిన విసురు పుగళేంది స్వాభిమానాన్ని గాయపరిచింది.

వెంటనే గురుపత్ని తనకు అంతకు ముందెన్నడో వాత్సల్యంతో తొడిగిన బంగారపు ఉంగరాన్ని విక్రయించి, వచ్చిన పద్దెనిమిది రూకలలో ఎనిమిది ఆమెకిచ్చి, మిగిలిన పది రూపాయల పెట్టుబడితో మద్రాసు చేరుకున్నారు. బంధువులెవరికీ చెప్పకుండా తన కాళ్ళ పైనే తను నిలవాలనే సంకల్పంతో.

మద్రాసులో ఆనాటి శాస్త్రీయ సంగీతోపాసకియైన సుబ్బులక్ష్మి అమ్మాళ్ అనే పాటకురాలి ఇంట పుగళేందికి ఆశ్రయం లభించింది. ఈయన్ని తీసుకెళ్ళి ఎన్.ఎస్.కృష్ణన్ గారికి సిఫారసు చేసినప్పుడు ఆయన గుర్తించి, సమయం లభించినప్పుడల్లా అవకాశం చేకూరుస్తానని హామీ ఇచ్చారు.

"కళా వర్ధని" ఆర్కెస్ట్రాకు అధినేతలైన సి.ఆర్. రామ్మూర్తిగారు పుగళేంది ప్రతిభకు ప్రోత్సాహమిస్తూ, లలితా పద్మినీల నృత్య ప్రదర్శనాలలో తాము వ్యస్తులై ఉన్నప్పుడల్లా తదితర ప్రదర్శనాలకు పుగళేందిని తనకు మారుగా పంపేవారు. అలాంటి సందర్భాలలోనే ఒకసారి మాడిలక్ష్మి, ఆమె చెల్లెల్లు సచ్చు నృత్య ప్రదర్శనాలలో పాల్గొనే అవకాశం లభించింది వారితో వీరి పరిచయం కౌటుంబిక స్నేహంగా అభివృద్ధి చెందింది. వారు ఆ అభిమానంతోనే పుగళేంది వివాహాన్ని కూడా వైభవంగా జరిపించారు బంధువుల అమ్మాయితో 1957 ఆగస్ట్ 21 న. నేడు పుగళేందికి నలుగురు చిరంజీవులు_ ముగ్గురబ్బాయిలు, ఒక అమ్మాయి.

"కళావర్ధని" ఆర్కెస్ట్రాతో అశేష విశేషానుభవం గడించిన పుగళేందికి సినిమాలకు కూడా సంగీతమివ్వాలనే అభిలాష అంకురించింది. తోడనే, అప్పట్లో అనేక చిత్రాలలో ఆర్కెస్ట్రా ఎరేంజర్ గా పని చేస్తున్న పాశ్చాత్య సంగీత నిపుణులు శ్రీ ధనరాజ్ కు తమ కోరిక ఎరుకపరిచారు. ధనరాజ్ వెంటనే ఈయనకు కెంపరాజ్ ప్రొడక్ష్న వారి "రాజా విక్రమ" తమిళ, కన్నడ చిత్రాలలో రీరికార్డింగ్ లో ఆర్గన్ వాయించే సదవకాశం కలిగించారు. అదే ఈయన చిత్ర వృత్తికి నాందీ, చిత్ర ప్రవృత్తికి అభివృద్ధీ.

తదుపరి సంగీత దర్శకులు సి.ఎన్.పాండురంగంగారికి సహాయకులుగా పని చేశారు పుగళేంది_అశోకా పిక్చర్స్ వారి "ఎన్ తంగై, గుమాస్తా, మామియార్" మున్నగు చిత్రాలకు.

నేటి దర్శక నిర్మాత శ్రీధర్ కథలో నిర్మింపబడిన "ఎదిర్ పారాదదు" అనే చిత్రానికి సహాయ సంగీత దర్శకత్వం నెఱపే రోజులో ఈయనకు దర్శక నిర్మాత కె.ఎస్. గోపాల కృష్ణన్ పాటకు మట్టుకట్టే అవకాశం లభించి, పరిచయం పెంపొందింది.

శ్రీ కె.వి.మహదేవన్ హెచ్.ఎం.వి. గ్రామఫోన్ కంపెనీలో సంగీత దర్శకుడుగా పని చేస్తూ, పలు చిత్రాలకు స్వరరచనసాగిస్తూన్న రోజులవి.. కీ||శే||ఎం.ఎల్. పతి నిర్మిస్తూ ఉండిన "మదన మోహిని" చిత్రానికి ఆయన సంగీతం అందిస్తున్న తరుణంలో తలవని తలంపుగా పానగల్ పార్క్ వద్ద పుగళేందిని కలుసుకున్నారు. తనతో ఇంటికి రమ్మని ఆహ్వానించారు. కాని, పుగళేందిలో పెరిగిన ఆత్మాభిమానం అడ్డుగోడై నిలవడం మూలాన, రానని

చెప్పారు గురువుగారితో. శిష్యుడి మనోబలాన్ని మెచ్చుకున్న శివం _తనతో పుగళేందిని కొనిపోయి, కె.వి.మహదేవన్ ను పరిచయం చేసి, పనికొచ్చేవాడని నచ్చజెప్పి, ఆయన వద్ద హార్మోనిస్టు పోస్టులో కుదిర్చారు.

కె.వి.ఎం. వద్ద చేరినదాదిగా చిత్ర సంగీతం సమకూర్చే కొత్త పద్దతులన్నీ ఆకళింపు చేసుకుంటూ, తమ భావి సంగీతవృత్తికి బలమైన పునాది వేసుకుంటూ, త్రివిక్రముడిలా పెరగ నారంభించారు పుగళేంది.

ప్రసిద్ధ చిత్రనిర్మాత ఎం.ఎ.వేణు "పెణ్ణరసి" అనే బ్రహ్మాండమైన చిత్ర నిర్మాణ సన్నాహాలు చేసి విజృంభిస్తూన్న తరుణాన కె.వి.ఎం., ఆ చిత్రానికి సంగీత కర్తగా కుదిరారు. చిత్రం పూర్తి అయి, సెన్సార్ ట్రబుల్ వల్ల రిలీజు ఒకింత ఆలస్యమైన కారణంగా రీరికార్డింగు అద్భుతంగా సమకూర్చాలని వేణు ఆదేశానుసారం ఆశించిన మహదేవన్ కు పూనాలో వారి బావమఱిది పెళ్ళికి వెళ్ళక తప్పని పరిస్థితి ఏర్పడేసరికి, వేణుగారికి ఎంతో నచ్చజెప్పి, తను వచ్చే లోపునే రీరికార్డింగు ప్రారంభించే పక్షాన పుగళేందితో కొనసాగించమనీ, తనకన్నా ఎంతమాత్రం తగ్గని ప్రతిభాశాలి అనీ సిఫారసు చేశారు; ఊర్నించి రాగానే తను మిగతా కార్యక్రమం చూసుకుంటానని హామీ ఇచ్చి వెళ్ళారు. ఆలస్యమవుతుందనుకున్న రీరికార్డింగు అత్యవసరంగా మర్నాడే ప్రారంభించవలసిన పరిస్థితి రాగా పుగళేందికి వేణు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కాని, ఏ కారణం చేతో ఆర్కెస్ట్రాలోని ప్రసిద్ద వాయిద్యగాండ్రు అదివరకే తాము వేరొక మ్యూజిక్ డైరెక్టర్ కు కాల్ షీట్ ఇచ్చేశామని నుడివిన నుడుగు పిడుగులా పడినా, పుగళేంది ఇసుమంతైనా చలించక కంపెనీ కారు తీసుకుని స్వయంగా సి.ఎన్.పాండురంగ గారి ఆర్కెస్ట్రాలోని పరిచితులైన ప్రముఖులందర్నీ ప్రోగు చేసి, వేళ తప్పకుండా మర్నాడే రీరికార్డింగ్ ప్రారంభించారు. తాము రాకపోయినా పుగళేంది రీరికార్డింగు జయప్రదంగా సాగిస్తున్నారని వినగానే మొదట రానన్న వాద్య విద్వాంసులు, వచ్చే డబ్బు ఎందుకు వదులు కోవడమని తమ ప్రోగ్రామ్ మారినందువల్ల తాము కూడా వచ్చేందుకు వీలు కలిగిందని వివరించి, వచ్చి చేరారు. ఉదార హృదయులైన పుగళేంది చిరునవ్వుతో వాళ్ళను ఆహ్వానించి, ఆర్కెస్ట్రాను బలపరచుకున్నారు. మూడు రోజులు నిరాఘాటంగా కడు సమర్థతతో నిర్వహించిన వీరి థ్రిల్లింగ్ రీరికార్డింగ్ విని; వేణు, ఎ.పి.నాగరాజన్ మున్నగు ప్రముఖులందరూ ముక్కు మీద వేలు వేసుకున్నారు.

ఆనాడు రీరికార్డింగ్ విరామ సమయంలో పుగళేంది రెండు దమ్ములు దమ్మి, వాద్యగాళ్ళను మళ్ళీ పనికి ఉపక్రమించడానికి చేరమంటూన్న సమయాన కె.వి.ఎం. తాము కూడా సిద్ధమేనంటూ మందహాసంతో వచ్చి పలకరించగా, పుగళేందికి గంపెడు బరువు తగ్గినట్టు ఒళ్ళు పులకరించింది. కాని, వేణూ, ఇతర ప్రముఖులూ కె.వి.ఎం., తో "భలే సహాయకుడ్ని సంపాదించావయ్యా. నువ్వు రాని లోటు తెలియనివ్వకుండా పని చేశాడు నీ అసిస్టెంటు. మిగిలిన రీరికార్డింగు కూడా ఇతగాడి చేతిమీదే కానిచ్చి, నువ్వు సూపర్ వైజ్ చెయ్యి." అనగానే కె.వి.ఎం., కొంచెం కూడా అపార్థం చేసుకోకుండా సహృదయతతో, తన మాట నిలబెట్టినందుకు పుగళేందిని అభినందించి, ఎంతో ప్రోత్సాహమిచ్చారు. తదాదిగా _కె.వి.ఎం. కు పుగళేంది పై తరగక పెరిగే అభిమానం___ ఈనాడు వీరిద్దరూ అభిన్న మిత్రులు. సంగీత మహారథ కృష్ణార్జునులు. రెండు వందల చిత్రాలకు పైగా కలిసి పని చేస్తూన్న కర్మవీరులు.

తన చిన్నతనాన పాటలూ, పాఠాలూ నేర్చుకున్న పెద్దలకు సైతం పాట నేర్పుతూన్న సమయాన పుగళేందికి ఒళ్ళు పులకరించేది. శ్రీమతులు పి.భానుమతి, కె.బి.సుందరాంబాళ్, శ్రీ చిదంబరం జయరామన్ మున్నగు గాయనీ గాయక శిఖామణుల చేత తను పాటలు పాడించిన సంధర్భాలు ఈయనకు అవి స్మరణీయాలు.

ఈయన స్వతంత్రంగా ఏ చిత్రానికి సంగీతం అందించినా కె.వి.ఎం., అనుమతి తీసుకుని మరీ పనిచేస్తారు నేటికీ. ఇది కె.వి.ఎం. అంటే ఈయనకు గల గురుభావం, గౌరవం, అభిమానం సూచించే అసదృశ తార్కాణం. అలాగే 'అప్పు'తో సంప్రతించే చేస్తారు కె.వి.ఎం., అన్ని వ్యవహారాలూ. ఇది ఆయనకు 'అప్పు' అంటే గల వాత్సల్యానికీ, విశ్వాసానికీ నిదర్శనం.

మోడరన్ థియేటర్స్ వారి తమిళ డబ్బింగ్ చిత్రం "జయవీరన్" కు, గోల్డన్ స్టూడియో వారి "నెల్వియన్ నెల్వన్", ఎ.పి. నాగరాజన్ గారి "గురు దక్షిణై" కి పుగళేంది స్వతంత్రంగా సంగీత సారథ్యం వహించారు. ఈ తమిళ చిత్రాలు కాక ఎం.ఎ.వేణు నిర్మించిన మలయాళ చిత్రం "ముదలాళి"కి. మరికొన్ని కేరళ చిత్రాలకు కూడా స్వతంత్రంగా సంగీత దర్శకత్వం వహించారు. పైన ఉదహరించిన మూడు తెలుగు చిత్రాల ద్వారా ఆంధ్ర ప్రజానీకానికి కూడా స్వతంత్ర సంగీత దర్శకుడుగా పరిచయం కాబోతున్నారు.

మితభాషీ, హితకారీ అయిన పుగళేంది సమయస్ఫూర్తితో ఇచ్చే సమాధానాలు ఎలాటి వారికైనా కితకితలు పెడతాయి. ఎప్పుడూ తన పనితోనే ఈయనకు పని. అనవసర జోక్యాలు కిట్టవు. అసందర్భ సంభాషణలు పట్టవు. ఫోటోగ్రఫీ ఈయన హాబీ. తీరుబడి లభించినప్పుడు ఇంటిల్లిపాదితో కాలక్షేపం చేయడం ఈయన సరదా.

ఈ కార్యైక దీక్షా దక్షుడికి ఈశ్వరుడు ఆయురారోగ్య ఐశ్వర్య భోగభాగ్యాలూ, అశేష విజయ పరంపరలూ చేకూర్చి, ఆశీర్వదిస్తుండాలని ప్రార్థిద్దాం.

★★★

★★★

COMMENTS